బెస్ట్ పోలీస్‌స్టేషన్ దుండిగల్



- జాతీయస్థాయిలో ఏడో స్థానం
- రాష్ట్రంలో ఏకైక ఉత్తమ ఠాణాగా గుర్తింపు


పోలీస్‌స్టేషన్‌కు అనుసంధానమైన సీసీ కెమెరాల ఫుటేజీలను చూస్తూ...


దుండిగల్ పీఎస్‌లో భద్రపరిచిన రికార్డులను పరిశీలిస్తూ...


ఠాణాను పరిశీలించిన అనంతరం దుండిగల్ పోలీస్ సిబ్బందితో మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ అధికారి



దుండిగల్ ఠాణాలో రిసెప్షన్

దుండిగల్: దుండిగల్ పోలీస్‌స్టేషన్‌కు అత్యుత్తమ అవార్డు లభించింది. తెలంగాణ రాష్ట్రంలోనే బెస్ట్ పోలీస్‌స్టేషన్‌గా ఎంపికై ఈ ఘనత సాధించింది. ప్రతి సంవత్సరం గవర్నమెంట్ ఆఫ్ ఇండియా (మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్) దేశంలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పనితీరును గమనిస్తుంది. అందులో అత్యుత్తమ సేవలు అందించిన పోలీస్‌స్టేషన్లను గుర్తించి అవార్డుకు నామినేట్ చేస్తారు. అందులో దుండిగల్ పోలీస్‌స్టేషన్ రాష్ట్రంలోనే బెస్ట్ పోలీస్ స్టేషన్‌గా, దేశవ్యాప్తంగా ఏడో స్థానంలో నిలిచింది. ఫ్రెండ్లీ పోలీసింగ్, బాధితులు రిసీవ్ చేసుకోవడం, స్టేషన్‌లో సిబ్బందికి, బాధితులకు కల్పిస్తున్న వసతులు, పోలీసుల ప్రవర్తన తదితర అంశాల ఆధారంగా అవార్డుకు ఎంపిక చేశారు.

మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ ఇవే చూస్తుంది..

◆ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఎన్‌డీపీఎస్ కేసులు, ఎక్సైజ్ కేసులు, ఆర్మ్స్ యాక్ట్ కేసులు, పోక్సో చట్టం కేసులు, ఎంవీ యాక్ట్ కేసులు, రేప్ కేసులు యాక్సిడెంట్ కేసులు, రికవరీ అండ్ డిటెన్షన్ కేసుల్లో పోలీస్ సిబ్బంది పనితీరు, సిబ్బంది ఆట్టి కేసులను డిస్పోసల్ చేసిన తీరు, పోలీస్‌స్టేషనలో మెయింటేన్ చేస్తున్న రికార్డుల పరిశీలన తదితర అంశాలను ఆధారంగా చేసుకుంటున్నారు.

◆ పోలీస్‌స్టేషన్‌కు వివిధ కేసుల విషయమై వచ్చే బాధితులతో పోలీస్ సిబ్బంది ఎలా ప్రవర్తిస్తున్నారన్న దానిపై బాధితులను నేరుగా అడిగి తెలుసుకుంటారు. అదేవిధంగా పోలీస్ సిబ్బందితో మాట్లాడి రెస్ట్‌రూమ్‌లు, బాత్‌రూమ్‌లు, మహిళా సిబ్బందికి ప్రత్యేక వసతులు ఉన్నాయా లేదా అని చూస్తారు. ఫిర్యాదుదారులకు స్టేషన్‌లో కల్పిస్తున్న వసతులు, చిన్నారుల తల్లులకు ఫీడింగ్ రూమ్, తాగునీరు, పీఎస్ చుట్టూ గ్రీనరీ, దివ్యాంగులు స్టేషన్‌కు వస్తే వారి పట్ల సిబ్బంది తీసుకునే శ్రద్ధ తదితర విషయాలను మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ అధికారులు పీఎస్‌కు వచ్చి నేరుగా పరిశీలించి బెస్ట్ పీఎస్‌ను ఎన్నుకుంటారు.

సీసీ కెమెరాలతో నిత్యం నిఘా..

దుండిగల్ పీఎస్ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పోలీస్‌స్టేషన్‌కు అనుసంధానం చేసి నిత్యం మానిటరింగ్ చేసేందుకు సిబ్బంది ఏర్పాటు చేశారు. చాలా వరకు కేసులు సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులను పట్టుకోవడంతో పరిష్కారమయ్యాయి. సీసీ కెమెరాల ఏర్పాటుతో స్థానికంగా దొంగతనాలు, చెయిన్ స్నాచింగ్‌లు తగ్గుముఖం పట్టాయి. దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధి సెక్టార్-1లో 1091, సెక్టార్-2లో 1063, సెక్టార్-3లో 1723, సెక్టార్-4లో 1734, సెక్టార్-5లో 785 మొత్తం 6396 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంలో దుండిగల్ పోలీసులు సఫలీకృతులయ్యారు.

సెక్టార్ల వారీగా పటిష్టమైన గస్తీ..

పోలీస్‌స్టేషన్ ప్రాంతాన్ని ఐదు సెక్టార్లుగా విభజించారు. ఆయా సెక్టార్లకు ఎస్సైలను ఇన్‌చార్జ్‌లుగా నియమించి పటిష్టమైన గస్తీని నిర్వహిస్తున్నారు.

◆ సెక్టార్-1 ఇన్‌చార్జ్‌గా ఎస్సై కిష్టయ్య (8712663275) విధులు నిర్వర్తిస్తున్నారు. సెక్టార్ పరిధిలో సాయిబాబానగర్, శివాలయ నగర్, సూరారం విలేజ్, ఓం జెండా-1, ఓం జెండా-2, 60 గజాలు, 120 గజాలు, సురేందర్‌రావునగర్, సూరారం కాలనీ, ముత్యాల బస్తీ, హమీద్ బస్తీలు వస్తాయి.

◆ సెక్టార్-2 ఇన్‌చార్జ్‌గా ఎస్సై కె.రాజేష్ (9985565572) వ్యవహరిస్తున్నారు. ఈ సెక్టార్ పరిధిలోని ప్రాంతాలు సూరారం రాజీవ్‌గృహకల్ప, బహదూర్‌పల్లి, బహదూర్‌పల్లి ఇందిరమ్మ కాలనీ.

◆ సెక్టార్-3 ఇన్‌చార్జ్‌గా ఎస్సై సర్దార్ నాయక్ (7901156048) బాధ్యతలు చేపట్టారు. ఈ సెక్టార్ పరిధిలో గండిమైసమ్మ, డీపోచంపల్లి, సారేగూడెం, డాక్టర్ బస్తీ, 120 గజాలు కాలనీలు ఉన్నాయి.

◆ సెక్టార్-4 ఇంచార్జిగా ఎస్సై వి.శ్రీనివాస్ (8712663274) విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ సెక్టార్ పరిధిలోకి మల్లంపేట్, భౌరంపేట్, శంబీపూర్, మహేశ్వరం, భౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలు వస్తాయి.

గర్వంగా ఉంది



తెలంగాణ రాష్ట్రంలోనే ఏకైక ఉత్తమ పోలీస్‌స్టేషన్‌గా దుండిగల్ పోలీస్‌స్టేషన్ ఎంపిక కావడం గర్వంగా ఉంది. సిబ్బంది సమష్టి కృషితో ఈ ఘనత సాధించాం. ఫిర్యాదు చేసేందుకు వచ్చే బాధ్యతలకు సత్వర న్యాయం అందించేందుకు చేస్తున్నాం. ఫ్రెండ్లీ పోలీసింగ్ సత్ఫలితాలు ఇస్తోంది. చాలా వరకు కేసులు సీసీ ఫుటేజీలు, స్థానికులు ఇచ్చిన సమాచారంతో కొలిక్కి వచ్చాయి. భవిష్యత్‌లో సైతం ఇదే స్ఫూర్తితో పనిచేస్తూ ముందుకు సాగుతాం.

– రమణారెడ్డి, దుండిగల్ ఇన్‌స్పెక్టర్

◆ సెక్టార్-5 ఇన్‌చార్జ్‌గా ఎస్సై ప్రభాకర్‌రెడ్డి (8801014801) విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ సెక్టార్ పరిధిలోని ప్రాంతాలు దుండిగల్ గ్రామం, దుండిగల్ తాండ-1, దుండిగల్ తండ-2, గాగిల్లాపూర్.

క్లుప్తంగా

మురుగు సమస్యకు చెక్ పెట్టాలి

జగద్గిరిగుట్ట: ప్రతినిత్యం వరదలా పారే మురుగుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జలమండలి అధికారులకు ఫిర్యాదు చేస్తే తూతూ మంత్రంగా శుభ్రం చేస్తున్నారు. మరుసటి రోజు మురుగు పారడం పరిపాటిగా మారింది. జగద్గిరినగర్‌లోని ప్రభుత్వ పాఠశాల రోడ్డులో నిత్యం డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు పొంగడంతో చిత్తడిగా మారుతోంది. కంపు భరించలేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక పాఠశాలకు వచ్చే విద్యార్థులు ఎక్కడ అనారోగ్యాల బారిన పడతారని వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు శాశ్వత ప్రాతిపదికన చర్యలు చేపట్టి మురుగు సమస్యకు చెక్ పెట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని బాచుపల్లి సబ్‌స్టేషన్ ఏఈ శాంతకుమార్ ఓ ప్రకటనలో తెలియజేశారు.

◆ నిజాంపేట్, ఎస్ఎల్‌జీ ఫీడర్ల పరిధిలోని కేజీఎం అపార్ట్‌మెంట్స్, హిల్‌పార్క్, ఎస్‌వీఎస్ అపర్ణ, శ్రీనివాస లేక్‌వ్యూ, ఇందిరనగర్, బాచుపల్లి గ్రామంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు...

◆ అదే విధంగా బీవీఆర్ఐటీ ఫీడర్ పరిధిలోని బీవీఆర్ఐటీ కళాశాల, పూజిత లేఅవుట్, సత్యం వ్యాలీ, రాజీవ్‌గాంధీనగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ వసతులు కల్పించండి


ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు సమస్యలను వివరిస్తున్న ప్రజలు

దుండిగల్: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని తెలంగాణ శాసనమండలి విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని కాలనీలు, బస్తీల ప్రజలు రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ వసతులు కల్పించాలని కోరుతూ ఎమ్మెల్సీకి వినతి పత్రాలు అందజేశారు. దీనిపై స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు ఎమ్మెల్సీని కలిసిన వారిలో ఉన్నారు.

బాలానగర్ డీసీపీ పరిధిలోకి కూకట్‌పల్లి,బాలానగర్ ఏసీపీలు

కుత్బుల్లాపూర్: పోలీస్ సేవలను విస్తృత పరిచే దిశగా పోలీస్ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. బాలానగర్ డీసీపీ పరిధిలో కూకట్‌పల్లి, బాలానగర్ ఏసీపీలను చేర్చారు. కూకట్‌పల్లి ఏసీపీ పరిధిలో కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, బాచుపల్లి, అల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌లు ఉన్నాయి. బాలానగర్ ఏసీపీ పరిధిలో బాలానగర్, సనత్‌నగర్, జీడిమెట్ల, జగద్గిరిగుట్ట పీఎస్‌లు ఉన్నాయి. అదే విధంగా మేడ్చల్ డీసీపీ పరిధిలోని పేట్‌బషీరాబాద్ ఏసీపీ పరిధిలో పేట్‌బషీరాబాద్, శామీర్‌పేట్, అల్వాల్, జీనోమ్ వ్యాలీ పోలీస్‌స్టేషన్‌లు, మేడ్చల్ ఏసీపీ పరిధిలో మేడ్చల్, సూరారం, దుండిగల్ పోలీస్‌స్టేషన్లను చేర్చారు.

నేడు జాతీయ సదస్సు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో 'ఖురాన్' వివరణపై జాతీయస్థాయి సదస్సును గురువారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు అరబిక్ విభాగం హెడ్ ప్రొఫెసర్ సయ్యద్ అలీమ్ అష్రఫ్‌జైసీ బుధవారం తెలిపారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలోని అరబిక్ విభాగం ఆధ్వర్యంలో కేరళలోని ఇంటర్నేషనల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ తఫ్సీర్ అల్ ఖురాన్ (ఐఆర్ఐటీఏక్యూ) సహకారంతోఈ సదస్సును నిర్వహిస్తారన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు

సాక్షి,మేడ్చల్ జిల్లా: లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ సెంటర్లపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ హెచ్చరించారు. గర్భస్థ పూర్వ, గర్భస్థ లింగ నిర్ధారణ నిషేధ చట్టాన్ని జిల్లాలో పక్బందీగా అమలు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో డీఎంహెచ్ఓ అధ్యక్షతన ప్రీ–కాన్సెప్షన్ అండ్ ప్రీ–నేటల్ డయాగ్నోస్టిక్ టెక్నిక్స్ (లింగ ఎంపిక నిషేధం) చట్టం అమలుపై జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశం జరిగింది. పీసీపీఎన్‌డీటీ చట్టం ప్రకారం ఇప్పటికే ఉన్న ఇమేజింగ్ 23 కేంద్రాల పునరుద్ధరణ, చట్టాన్ని పకడ్బందీగా అమలు పరిచేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై సమావేశంలో జిల్లా సలహా కమిటీ ప్రతినిధులు చర్చించారు. ఆడపిల్లల సంఖ్య తగ్గిపోతున్న తరుణంలో లింగ నిర్ధారణపై పరీక్షల నిర్వహణ చట్ట విరుద్ధమని, స్కానింగ్ కేంద్రాల్లో పర్మినెంట్ రికార్డులు మెయింటేన్ చేయడంతో పాటు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో స్కానింగ్ సమాచారాన్ని పొందుపరచాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా నోడల్ అధికారి, డిప్యూటీ విస్తరణ మీడియా అధికారి వేణుగోపాల్‌రెడ్డి, గైనకాలజిస్ట్ డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ రాజేంద్రప్రసాద్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాఘవేందర్, డీపీఆర్ఓ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డా. పుట్ల శ్రీనివాస్

ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలి



సాక్షి,మేడ్చల్ జిల్లా: శాసన మండలి ఎన్నికల ప్రవర్తనా నియమావళి తప్పకుండా పాటించాలని, ఈ విషయంలో జిల్లా ఎన్నికల అధికారి అయిన కలెక్టర్ ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ సూచించారు. బుధవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు, ప్రవర్తనా నియమావళి అమలు, ఓటరు తుది జాబితా, బ్యాలెట్ పేపర్ వెరిఫికేషన్ తదితర విషయాలపై ఆయా జిల్లాల కలెక్టర్లతో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదైన ఉపాధ్యాయుల వివరాలు ముఖ్యంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులకు సంబంధించిన సమాచారాన్ని వెంటనే అప్‌లోడ్ చేయాలన్నారు. బ్యాలెట్ పత్రాలకు సంబంధించి వెరిఫికేషన్ రిపోర్టు పంపించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అమయ్ కుమార్, జిల్లా అదనపు కలెక్టర్లు ఏనుగు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, ఆర్డీఓలు రవి, మల్లయ్య, కలెక్టరేట్ ఏఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి అడ్డు వస్తోందని...

- రోడ్డుపై విద్యుత్ స్తంభం ఏర్పాటు
- అడ్డుకుని ఏఈకి ఫిర్యాదు చేసిన స్థానికులు



సుభాష్‌నగర్: రాకపోకలకు ఇబ్బంది కలిగే విధంగా విద్యుత్ శాఖ సిబ్బంది విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్నారంటూ స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేసి అడ్డుకున్నారు. సుభాష్‌నగర్ డివిజన్ సాయిబాబా నగర్ నుంచి భగత్‌సింగ్‌నగర్ మీదుగా జీడిమెట్ల పారిశ్రామికవాడకు వెళ్లే రోడ్డు 40 ఫీట్లు ఉండేది. ఇరుపక్కల రోడ్డుపైకి జరిగి నిర్మాణాలు చేపట్టడంతో ప్రస్తుతం 20 ఫీట్లే మిగిలింది. బుధవారం స్థానికంగా ఓ వ్యక్తి తన ఇంటి నిర్మాణానికి అడ్డు వస్తోందని విద్యుత్ స్తంభాన్ని రోడ్డుపై ఏర్పాటు చేస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. దీంతో సిబ్బంది వెనుదిరిగారు. అనంతరం ఏఈ కృష్ణకు బస్తీవాసులు ఫిర్యాదు చేశారు. ఈ విద్యుత్ స్తంభం మార్పిడంపై స్థానికంగా ఓ నాయకుడితో 1లక్ష 50 వేల రూపాయలు సిబ్బంది ఒప్పందం కుదుర్చుకున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ అమయ్‌కుమార్

సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రభుత్వం కంటికి సంబంధించిన ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి పేదోడికి ఉపయోగపడేలా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని 18ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో కంటివెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. కంటి వెలుగులో అనుభవం ఉన్న కంటి వైద్యులతో ఉచితంగా కంటి పరీక్షలు చేయించడంతో పాటు అవసరమైన వారికి కళ్లద్దాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, జిల్లా డిప్యూటీ విస్తరణ మీడియా అధికారి వేణుగోపాల్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

డా.బాలసుబ్రమణియన్, డా.రేణుస్వరూపలకు అవార్డులు

రాయదుర్గం: డాక్టర్ బీఎస్ బజాజర్ మెమోరియల్ ఎఫ్ఏబీఏ ఎక్స్‌లెన్స్ అవార్డు-2023కు డాక్టర్ రేణుస్వరూప్, డైరెక్టర్ డాక్టర్ బాలసుబ్రమణియన్‌లను ఎంపిక చేశారు. బుధవారం గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ బయోటెక్ అసోసియేషన్స్ (ఎఫ్ఏబీఏ) ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ రెడ్డన్న వీరి పేర్లను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2010 నుంచి బయోటెక్నాలజీ, లైఫ్ సైన్సెస్ రంగానికి సుదీర్ఘకాలంలో చేసిన సేవలకుగాను ప్రముఖులను గుర్తించి సత్కరించేందుకే ఈ అవార్డులను అందిస్తున్నామన్నారు. డాక్టర్ రేణు స్వరూప్ కేంద్ర బయోటెక్నాలజీ శాఖ కార్యదర్శిగా పని చేశారని, ఆమె జాతీయ కార్యక్రమాల ప్రణాళిక, అమలులో కీలకపాత్ర పోషించారు.అలాగే డాక్టర్ దొరైరాజన్ బాలసుబ్రమణియన్ హైదరాబాద్ ఎల్‌విప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌లో రీసెర్చ్ డైరెక్టర్‌గా పనిచేశారని పేర్కొన్నారు.. జీనోమ్ వ్యాలీ స్థాపన లో, రాష్ట్ర బయోటెక్నాలజీ అడ్వైజరీ కమిటీ చైర్మన్‌గా, సైన్స్ అండ్ టెక్నాలజీని ప్రాచుర్యంలోకి తీసుకురావడంలో చేసిన కృషికి గుర్తింపుగా ఎఫ్ఏబీఏ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుకు ఆయన్ని ఎంపిక చేశామన్నారు.

రెండో అంతస్తు పై నుంచి పడిన మహిళ

ఆస్పత్రికి తరలింపు
కేసు నమోదు చేసిన పోలీసులు

కుత్బుల్లాపూర్: అనుమానాస్పద స్థితిలో ఓ గృహిణి భవనం రెండో అంతస్తు పై నుంచి పడి తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన శంకర్, పూజ(21) భార్యాభర్తలు. కూలి పని చేసుకుని జీవనం సాగిస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం భర్త ఇంట్లో నుంచి కూలికి వెళ్లగా రెండో అంతస్తులో బట్టలు ఆరేసేందుకు వెళ్లి పూజ ప్రమాదవశాత్తు కింద పడినట్లు స్థానికులు గుర్తించారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మహిళను సూరారంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సహాయక చర్యలపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ బృందం

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఎన్‌డీఆర్ఎఫ్ బృందం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వరదలు, అగ్ని ప్రమాదాలు, భూకంపాలు సంభవించినప్పుడు, ఏదైనా భవనం కూలిపోయినపుడు ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు ఎలా పని చేస్తాయన్న విషయాలపై విశదీకరించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో చేపట్టే సహాయక చర్యలు, ఉపయోగించే పనిముట్లు తదితర విషయాలను ప్రత్యక్షంగా చూపించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాలనీలో భారీ వాహనాల రాకపోకలకు కట్టడి

రంగారెడ్డినగర్: ఏపీహెచ్‌బీ కాలనీలోకి భారీ వాహనాలు రాకపోకలతో రోడ్లు ధ్వంసం అవుతున్నాయి. కాలనీలోని టీఎస్ఐఐసీ ఖాళీ స్థలంలో నిత్యం ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన బస్సులు, ఇతర భారీ వాహనాలను నిలుపుతున్నారు. ఈ నేపథ్యంలో కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నివారణ చర్యలు చేపట్టారు. గడ్డర్‌ను ఏర్పాటు చేసి కాలనీలోకి భారీ వాహనాల రాకపోకలను కట్టడి చేశారు.


ఏపీహెచ్‌బీ కాలనీలోని టీఎస్ఐఐసీ స్థలానికి ఆనుకుని ఉన్న రోడ్డులో ఏర్పాటు చేసిన గడ్డర్

అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేస్తాం

కుత్బుల్లాపూర్: ప్రజా సంక్షేమమే పరమావధిగా బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. బుధవారం ప్రగతియాత్రలో భాగంగా ఎమ్మెల్యే సూరారం డివిజన్‌లోని టీఎస్ఐఐసీకాలనీ, రాజీవ్‌గాంధీనగర్, స్కందానగర్‌లలో పర్యటించి స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా టీఎస్ఐఐసీ కాలనీలో రూ.3.05 కోట్లతో చేపడుతున్న మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులను త్వరిగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

◆ స్కందానగర్‌లో చర్చి పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ రాజేశ్వరరావు ముఖ్యఅతిథులుగా హాజరై భూమిపూజ చేశారు. అనంతరం నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.

◆ గాజులరామారం డివిజన్ కైసర్‌నగర్‌లో రేణుకా ఎల్లమ్మ, నల్ల పోచమ్మ ఆలయ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నూతనంగా ఎన్నికైన ఆలయ కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి తన వంతుగా రూ.2.50 లక్షల విరాళాన్ని ఎమ్మెల్యే ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రెసిడెంట్ సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నాం


కార్పొరేటర్ వీరేందర్‌రెడ్డిని సత్కరించిన రేణుకగ్రాండ్, తారికాస్ ప్రెస్టేజ్ అపార్ట్‌మెంట్‌వాసులు

నిజాంపేట్: డివిజన్ సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నానని నిజాంపేట్ 18వ డివిజన్ కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం శ్రీరేణుక ఎల్లమ్మకాలనీలోని రేణుక గ్రాండ్, తారికాస్ ప్రెస్టేజ్ అపార్ట్‌మెంట్ వాసులు కార్పొరేటర్ వీరేందర్‌రెడ్డి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డివిజన్ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తానన్నారు. పెండింగ్ పనులను త్వరలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ జనరల్ సెక్రటరీ నరోత్తమ్, రేణుక గ్రాండ్ అపార్ట్‌మెంట్ సభ్యులు శ్రీనివాస్, అనీల్, ప్రవీణ్, తారకస్ ప్రెస్టేజ్ అపార్ట్‌మెంట్ సభ్యులు మూర్తి, బిశ్వనాథ్, నస్రీన్‌ఖాన్, శశిధర్, అజయ్, హరీష్ తదితరులు ఉన్నారు.

సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను వాడొద్దు

దుండిగల్ కమిషనర్ సత్యనారాయణరావు

దుండిగల్: పర్యావరణంతో పాటు ప్రజారోగ్యంపైపెను ప్రభావం చూపుతున్న సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను వాడొద్దని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరావు కోరారు. బుధవారం గండిమైసమ్మ చౌరస్తాలోని పలు హోటళ్లు, రెస్టారెంట్‌లు, టిఫిన్ సెంటర్లలో కమిషనర్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పరిశుభ్రత పాటించని బావర్చీ రెస్టారెంట్‌కు రూ.10వేలు, ఎంఆర్‌సీబీ రెస్టారెంట్‌కు రూ.20వేలు, ఓ టిఫిన్ సెంటర్‌కు రూ.5 వేల చొప్పున జరిమానా విధించారు.

◆ అంతకు ముందు మున్సిపల్ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణతో పాటు కార్మికుల బయోమెట్రిక్ హాజరును పరిశీలించారు. శానిటరీ సూపర్‌వైజర్ కరుణాకర్‌రెడ్డి, జవాన్‌లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

◆ బౌరంపేట్‌లోని డంపింగ్‌యార్డ్‌లో జరుగుతున్న బయో మైనింగ్ పనులను మున్సిపల్ ఇంజినీర్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి కమిషనర్ పరిశీలించారు. డంపింగ్‌యార్డ్‌లో చెత్తకు నిప్పు అంటుకోవడంతో ట్యాంకర్లతో నీళ్లు చల్లించి పొగ రాకుండా నివారణ చర్యలు చేపట్టారు. వ్యర్థాల బయోమైనింగ్ పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

◆ అదే విధంగా బహదూర్‌పల్లి వార్డులో రోడ్డు పక్కన ఈ–వేస్ట్‌ను డంప్ చేసిన వారిని గుర్తించి రూ.3వేల చలాన్ విధించారు. అదే విధంగా రోడ్డు పక్కల కొనసాగుతున్న స్క్రాప్ దుకాణాలను తొలగించారు.


డంపింగ్‌యార్డు వద్ద మంటలను అదుపులోకి తీసుకొస్తున్న సిబ్బంది,కమిషనర్ సత్యనారాయణరావు

కుత్బుల్లాపూర్‌లో బీజేపీ జెండా ఎగరడం ఖాయం

ఎమ్మెల్యే ఈటల రాజేందర్

కుత్బుల్లాపూర్: ప్రజా గోస – బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా జగద్గిరిగుట్టలోని రాజీవ్ గృహకల్ప, సూరారం డివిజన్‌లోని సంజయ్‌గాంధీ నగర్‌లో బుధవారం స్ట్రీట్ కార్నర్ సమావేశాలు నిర్వహించారు. శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌లు సుశాంత్‌గౌడ్, శ్రీనివాస్‌చారి ఆధ్వర్యంలో జరిగిన సమావేశాలకు ముఖ్యఅతిథులుగా హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఒక్క పేదవాడికి గుంట భూమి దక్కలేదన్నారు. ఒక్క కొత్త రేషన్ కార్డు ఇవ్వలేదని విమర్శించారు. జీఓ.59 కింద దరఖాస్తు చేసుకున్న పేదలకు లక్షల రూపాయలు కట్టాలని పంపిన నోటీసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్, నల్లా బిల్లుల పేరుతో ప్రభుత్వం ప్రజలపై అధిక మొత్తంలో భారం మోపిందన్నారు. కుత్బుల్లాపూర్ ప్రజల సమస్యలు తెలుసుకునేందుకే స్ట్రీట్ కార్నర్ సమావేశాలు నిర్వహించామన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బక్క శంకర్‌రెడ్డి, భావిగడ్డ రవి, గరిగే శేఖర్, డివిజన్ అధ్యక్షులు పున్నా రెడ్డి, దుర్యోధన రావ్, డివిజన్ ఇన్‌చార్జ్‌లు మోతే శ్రీనివాస్, రాజిరెడ్డి, బూత్ అధ్యక్షులు ఎల్ల స్వామి, పుల్లారెడ్డి, సుధాకర్ రెడ్డి, నవీన్ గౌడ్, సరళా దేవి, కృష్ణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


స్ట్రీట్ కార్నర్ సమావేశంలో మాట్లాడుతున్న హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల


పాల్గొన్న కుత్బుల్లాపూర్ బీజేపీ నాయకులు, స్థానికులు